క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



పూజలందుకున్న లక్ష్మణ సమేత సీతారాములు

ముదిగుబ్బ: నల్లచెర్లోపల్లి గ్రామంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామంలోని రాముల గుడిలో రెండు రోజులుగా హోమాలు, పూజలు తదితర వాటిని నిర్వహించారు. చివరి రోజున వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



విజేతలకు మెమెంటోలు బహూకరిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ ఫ్రెండ్లీ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం గోరంట్ల మండల విద్యాధికారి జాన్‌రెడ్డెప్ప ముఖ్య అతిథిగా హాజరై మ్యాచ్‌లను ప్రారంభించారు. ఉదయం జరిగిన మ్యాచ్‌లో గోరంట్ల జట్టుపై కదిరి జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అనిల్ నిలిచాడు. రెండవ మ్యాచ్‌లో తనకల్లు–2పై ఎన్పీకుంట జట్టు గెలుపొందింది. మూడవ మ్యాచ్‌లో అమడగూరు జట్టుపై నల్లమాడ జట్టు విజయం సాధించింది. విజేత జట్లకు మెమెంటోలు సీనియర్ క్రీడాకారులు హరిప్రసాద్‌రెడ్డి, ఆజం బాషా, అశ్వర్థనారాయణ అందజేశారు.

చికిత్స పొందుతూ మున్సిపల్ వర్కర్ మృతి



మృతుడు మల్లికార్జున(ఫైల్)

ధర్మవరం: మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్న మల్లికార్జున(48) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లో ఈనెల 4న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చేర్పించాడు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని ఆదివారం ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేయవచ్చని పేర్కొన్నారు.

30 పడకల ఆస్పత్రి!



ముదిగుబ్బ పీహెచ్‌సీ

- 80 వేల జనాభాకు 6 పడకలే
- వైద్య సేవల కోసం అవస్థలు పడుతున్న మండల ప్రజలు

ముదిగుబ్బ: రాష్ట్రంలో అతి పెద్ద మండలంగా పేరుగాంచిన ముదిగుబ్బకు 30 పడకల ఆస్పత్రి కలగానే మారుతోంది. 80 వేల జనాభా ఉన్న మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి చాలా అవసరం. 1964లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తానని హామీ ఇచ్చారు. అయితే అది ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఇటీవల 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించారు. అయితే నేతలు ప్రకటనలు మాత్రమే చేస్తారా ఆచరణకు ఉపక్రమిస్తారా అన్నది చూడాల్సి ఉంది.

తరచూ రోడ్డు ప్రమాదాలు..

205 జాతీయ రహదారి ముదిగుబ్బ మీదుగా పోవడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ మెరుగైన వైద్య సేవలు లేక ప్రమాదాలు జరిగిన వారికి ప్రథమ చికిత్స చేసిన వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికిగాని అనంతపురం ఆసుపత్రికి రెఫర్ చేస్తుంటారు. కొన్ని సమయాల్లో అక్కడికి చేరుకునేలోపు ప్రాణాలు కోల్పోయిన వారు ఎంతో మంది ఉన్నారు. దీంతో పాటు మలకవేమల క్రాస్‌లో మరో పీహెచ్‌సీ ఉంది. అయితే ఆ పీహెచ్‌సీకి సంబంధించి 5 సచివాలయాల పరిధిలో మాత్రమే ఆసుపత్రి సేవలు అందుతున్నాయి. మిగిలిన 17 సచివాలయాలు ముదిగుబ్బ పీహెచ్‌సీ పరిధిలో ఉంటాయి. దీంతో అధిక శాతం ముదిగుబ్బ పీహెచ్‌సీపైనే ఆధారపడి ఉండాల్సి ఉంది. మండల వ్యాప్తంగా 13 ఆరోగ్య ఉపకేంద్రాలుండగా అందులో కొడవండ్లపల్లి, మల్లేపల్లి, సంకేపల్లిలో ఉన్న ఉపకేంద్రాల్లో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది కొరత

మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎన్ పోస్టు ఖాళీగా ఉంది. అదే విధంగా డేటా ఎంట్రీ పోస్టు ఖాళీగా వుంది. గతంలో నలుగురు ఈ ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. స్టాఫ్ నర్సులు ముగ్గురు పేరుకు మాత్రం వున్నారు కాని డిప్యుటేషన్‌పై ఎక్కడో పనిచేస్తూ ఇక్కడ వేతనాలు పొందుతున్నారు. రోజూ 200 మందికి పైగా రోగులు వైద్యం కోసం వస్తుంటారు.

ఆపరేషన్లు మరిచిపోయారు..

గతంలో ట్యూబెక్టమీ, బటన్ హోల్ ఆపరేషన్లు ఇక్కడ చేస్తుండేవారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న డాక్టర్లకు ఆ పనిలో నైపుణ్యత లేక ఆపరేషన్లు చేయడం లేదు. ఆపరేషన్ చేయించుకోవాలనుకునేవారు అటు కదిరికి ఇటు అనంతపురం వెళుతుంటారు. ఆపరేషన్లకు అన్ని సదుపాయాలున్నా డాక్టర్ల లేక ఇక్కడ ఆపరేషన్లు నిలిపివేశారు.

30 పడకల ఆసుపత్రి వస్తే..

30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే ఐదారుమంది వైద్యులు ఇక్కడ పనిచేస్తారు. డెంటల్, ఐ స్పెషలిస్టు, గైనకాలజిస్టు, మొదలైన ప్రత్యేకమైన డాక్టర్లు కూడా అందుబాటులో ఉంటారు. అదే విధంగా మందుల కొరత లేకుండా పోతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు వారిని ఇక్కడికి తీసుకొస్తే వారికి ఇక్కడే వైద్యం అందించి ప్రాణాలు నిలిపే అవకాశాలుంటాయని ప్రజలు భావిస్తున్నారు.



శిథిలావస్థలో సిబ్బంది క్వార్టర్స్

శిథిలావస్థలో క్వార్టర్స్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో వున్న క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. భవనాలు ఉపయోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. పాములు, తేళ్లు చేరుకొని పరిసర ప్రాంతాలు ముళ్లపొదలు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ క్వార్టర్స్ సరిగా లేకపోవడం వల్ల ఇక్కడ పనిచేసే డాక్టర్లు సిబ్బంది పట్టణ ప్రాంతాలలో నివాసం ఏర్పరుచుకొని అక్కడి నుంచి రోజు ఇక్కడికి వస్తుంటారు.

నాడీ చూసే డాక్టరేరీ?



ఎన్నో ఇబ్బందులు పడి గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తే ఇక్కడ ఉన్న డాక్టర్లు కనీసం చెయ్యి పట్టుకొని నాడీ పరీక్షలు కూడా చేయడం లేదు. ఏమి జబ్బు అడిగిన వెంటనే వారికి తోచిన మందులను రోగులను పంపిస్తుంటారు. ఈ పద్ధతి ఎన్నాళ్లకు మారుతుందోనని ఎదురు చూస్తున్నాం.

–దేగల గంగప్ప, తప్పెటవారిపల్లి

30 పడకల ఆసుపత్రి అవసరం



80 వేల జనాభా ఉన్న ముదిగుబ్బకు 30 పడకల ఆసుపత్రి చాలా అవసరం , గతంలో మంత్రి కామినేని శ్రీనివాసులు, ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ 30 పడకల ఆసుపత్రికి హామీ ఇచ్చారు. హామిని నెరవేర్చడానికి చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

–మునిచంద్ర, దొరిగిల్లు

అందుబాటులో మందులు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రోజూ 200 మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు మాత్రమే పనిచేస్తున్నాం. మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చితే బాగుంటుందని బావిస్తున్నాం. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మాత్రం ఈ ఆసుపత్రిలో చేయడం లేదు.

– డాక్టర్ శ్వేత, ముదిగుబ్బ

రేపు బెస్ట్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

పుట్టపర్తి అర్బన్: గోరంట్ల సమీపంలో నెలకొల్పిన భారతీయ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ(బెస్ట్ యూ) రెండో స్నాతకోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి డబ్ల్యూఏఎస్ ఫెలా టార్ప్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎండీ శౌర్యదోవల్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించనున్నట్లు వర్సిటీ యాజమాన్యం పేర్కొంది. ఇక ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన 242 మందికి గ్రాడ్యుయేట్లను జ్ఞాపికలతో సత్కరించనున్నట్లు తెలిపింది. ముగ్గురు విద్యార్థులకు బంగారు పతకాలు, ఇద్దరికి రజిత పతకాలు ఇచ్చి గౌరవిస్తామని, ఇంక్యుబేషన సెంటర్‌ను ప్రారంభించి 9 స్టార్టప్‌లలో యువ పారిశ్రామిక వేత్తలను గౌరవిస్తామని పేర్కొంది. కార్యక్రమాలను ఎండీ భరత్ లాల్ మీనా, చాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్, వైస్ చాన్సలర్ సుబ్రమణ్యం తదితరులు ప్రసంగించనున్నట్లు వివరించింది.

కంటి వైద్య శిబిరంతో నిరుపేదలకు చేయూత



దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేద ప్రజలకు కంటిచూపును అందిస్తూ చేయూతనిస్తున్నామని రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి చూపు తగ్గిన వారికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో 143 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 89 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. అనంతరం క్యాంపు దాతలతోపాటు వైద్యులను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. సాంస్కృతిక మండలి వ్యవస్థాపకుడు సత్రసాల ప్రసన్నకుమార్, రోటరీక్లబ్ సభ్యులు రామకృష్ణ, శివయ్య, కొండయ్య, శ్రీనివాసరెడ్డి, మనోహర్‌గుప్త, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీల్లో ఉపాధ్యాయుల ప్రతిభ



రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి ఎంపికైన మహిళా టీచర్లకు మెమెంటోలు అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: జిల్లాస్థాయి చెస్ పోటీల్లో ఉపాధ్యాయులు ప్రతిభ చూపారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఆదివారం కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు మెమెంటోలు, బహుమతులు అందించారు. విజేతలు సెప్టెంబర్‌లో గుంటూరులో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వారు తెలిపారు. ఈ టోర్నీలో న్యాయ నిర్ణేతలుగా ఆదిరత్నాకర్, కిశోర్‌కుమార్, సోమశేఖర్‌ప్రసాద్, పీడీలు రమేష్, నాగేంద్ర వ్యవహరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షులు జీహెచ్ బాబు, ఆడిట్ కమిటీ సభ్యులు రామకృష్ణ నాయక్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ టోర్నీలో విజేతలు వీరే...

- మహిళా టీచర్స్ విభాగంలో: ఎస్.సబిహాభాను(అమలాపురం), పి.సీతారత్నం(ఎన్పీ కుంట), ఎం.దుర్గ(ధర్మవరం), జి.మహేశ్వరి(ధర్మవరం)
- పురుష టీచర్స్ విభాగంలో: బి.శివకృష్ణ(కేశాపురం), ఎం.జయచంద్ర(గుడిబండ), వై.శ్రీనివాసరెడ్డి(లేపాక్షి), ఎస్.లక్ష్మినారాయణస్వామి(చెన్నేకొత్తపల్లి)

కదిరి అర్బన్ సీఐ బాధ్యతల స్వీకరణ



డీవీ నారాయణరెడ్డి

కదిరి టౌన్: స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కదిరి అర్బన్ సీఐగా డీవీ నారాయణరెడ్డి ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా నూతన సీఐకు ఎస్‌ఐలు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. అందరికీ అందుబాటులో ఉండి మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తానని సీఐ పేర్కొన్నారు.

బీసీలంతా ఐకమత్యంతో ఉద్యమించాలి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ధర్మవరం అర్బన్: బీసీలంతా ఐకమత్యంతో ఉద్యమించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం బీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బీసీల సమస్యలపై ప్రభుత్వ అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ధర్మవరం కమిటీని ఎంపిక చేశారు. ధర్మవరం బీసీ సంఘం అధ్యక్షుడిగా బండి వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా రవి, కార్యదర్శిగా జంగమన్న, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బోయ రవిచంద్ర, కోటి వెంకటేష్, చాకలి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు

ధర్మవరం: అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాలను ధ్వంసం చేసిన టీడీపీ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు దేవరకొండ రమేష్, చౌడయ్య, గుజ్జల సళప్ప, కుణుతూరు గోపాల్, అజంతా కిష్ట, గజ్జల శివయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ లోనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రూ.404 కోట్లతో ఏర్పాటు చేశారన్నారు. రెండు రోజుల క్రితం విజయవాడలో రాత్రిపూట విద్యుత్ సరఫరాను నిలిపివేసి జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించి అంబేడ్కర్ విగ్రహాన్ని ఇనుపరాడ్లు, మారణాయుధాలతో ధ్వంసం చేయాలని టీడీపీ గుండాలు ప్రయత్నించారన్నారు. వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు మోటుమర్ల రమణ, కృష్ణమూర్తి, అశోక్, దేరవకొండ నరసింహులు, గుజ్జల కుళ్లాయప్ప, సాకే లక్ష్మీనారాయణ, మిద్దె మల్లికార్జున, భవాని, శివ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న కల్పవల్లి సొసైటీ సీఈఓ చిరంజీవి

చెన్నేకొత్తపల్లి: పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కీలకమని కల్పవల్లి సీఈఓ చిరంజీవి అన్నారు. టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న కల్పవల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ముష్టికోవెల సమీపంలోని కల్పవల్లి అటవీ ప్రాంతంలో రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని యువతకు పర్యావరణ పరిరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ.. 1992 నుంచి పర్యావరణాన్ని ఏ విధంగా కాపాడుకోవాలి అనే దానిపై యువతకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. యువత పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. వన సంరక్షణ కమిటీలు చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో కల్పవల్లి సొసైటీ అధ్యక్షుడు వెంకట రమణప్ప, కల్చరల్ కో–ఆర్డినేటర్ రవి, డైరెక్టర్లు, కల్పవల్లి సిబ్బంది బాలమురళి, ఆదినారాయణ, ముఖేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేని చెరువులు.. సాగులేని భూములు!

- నీరు లేక ఎండిపోయిన చెరువులు
- అడుగంటిపోయిన భూగర్భ జలాలు
- ఆయకట్టు రైతుల ఆందోళన



నీరు లేక ఎండిపోయిన పోతుకుంట చెరువు



సాగుకు నోచుకోని ఆయకట్టు భూములు

ధర్మవరం రూరల్: ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావం వెంటాడుతోంది. దీంతో ఎక్కడ చూసిన చెరువులు నీళ్లు లేక వట్టికుండను తలపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర్మవరం నియోజకవర్గం సమీపంలో హంద్రీ నీవా కాలువ వెలుతున్నా పాలకులు వాటి ద్వారా చెరువులు నింపే ప్రయత్నం చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వరకు వర్షాలు సమృద్ధిగా కురిసి ధర్మవరం నియోజకవర్గంలో చెరువులు, డ్యాంలు, కుంటలు, చెక్ డ్యాంలు నిండి జలకళతో పాటు పచ్చని పైర్లతో పల్లె సీమలు కళకలలాడేవి. అయితే నేటికీ నియోజకవర్గంలో బలమైన వర్షాలు కురవకపోవడంతో పంట సాగు ఎలా ఉన్నా తాగునీటి అవసరాలు, పశువులకు గ్రాసం కొరత ఏర్పడుతోందని గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వట్టిపోయిన చెరువులు

ధర్మవరం మండలంలో పోతుకుంట, గొట్లూరు, రేగాటిపల్లి, రావులచెరువు, కట్టకిందపల్లి, చింతలపల్లి, పోతులనాగేపల్లి అలాగే బత్తలపల్లి మండలంలో మాల్యవంతం, బత్తలపల్లి, పోట్లమర్రి, సంగాల, అప్రాచెరువు, తాడిమర్రి మండలంలో తాడిమర్రి తూర్పు చెరువు, పడమర చెరువు, అగ్రహారం, నార్సింపల్లి, నిడిగల్లు, అదే విధంగా ముదిగుబ్బ మండలంలో దొరిగిల్లు, గుంజేపల్లి, ముదిగుబ్బ, యను మలవారిపల్లి చెరువులలో చుక్క నీరు లేక ఎండిపోయాయి.

డ్యాంలలోకి నీరు చేరేదెప్పుడు?

ముదిగుబ్బ మండలంలో యోగి వేమన, జిల్లేడుబండ ప్రాజెక్టులున్నాయి. యోగివేమన ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 0.226 టీఎంసీలు కాగా ఆయకట్టు విస్తీర్ణం 12,880 ఎకరాలు. ప్రాజెక్టుకు హంద్రీ–నీవా ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.అదే విధంగా ధర్మవరం చెరువులో .373 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఆయకట్టు 1922 ఎకరాలు ఉంది. కొద్దిగా నీరుంది. ఇవి కేవలం నారు పోయడానికి మాత్రమే సరిపోతాయి. దీంతో ఈ ఏడాది ధర్మవరం చెరువు కింద పంటలు సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదు.

వర్షాల కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వర్షాలు కురవాలంటు గ్రామాల్లోని ఆలయాల్లో దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అదే విధంగా పండితుల ఆధ్వర్యంలో విరాట పర్వం పుస్తక పఠనం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో కప్పలకు పెళ్లిల్లు, బొడ్రాళ్లకు నీళ్లు పోయడం, కడవ సగినం తదితర వాటిని చేస్తున్నారు.

బీళ్లుగా ఆయకట్టు భూములు

ధర్మవరం నియోజకవర్గంలో 20 వేల హెక్టార్లకు పైబడి చెరువుల కింద ఆయకట్టు భూములున్నాయి. అక్కడక్కడా రైతులు వరి పైర్లు పోసుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ముందస్తుగా వరి పంటను సాగు చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. అయితే నేటికి చినుకు జాడలేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

అడుగంటిన భూగర్భ జలం

ధర్మవరం నియోజకవర్గంలో వ్యవసాయ బోరు బావుల్లో నీరు అడుగంటిపోయాయి. వస్తున్న కొద్దిపాటి నీటితో ఆరు తడి పంటలను సాగు చేసుకుంటున్నారు. మరో నెల రోజుల్లో వర్షాలు రాకపోతే వస్తున్న కొద్ది పాటి నీరు కూడా రాకుండా బోరుబావులు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హంద్రీనీవా ద్వారా డ్యాంకు నీరు వదలండి



ప్రస్తుతం యోగివేమన రిజర్వాయర్‌లో నీటి మట్టం పూర్తీ స్థాయిలో తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలు కూడా కురవడం లేదు. దీంతో డ్యాం కింద ఉన్న ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా డ్యాంలోకి నీరు తెప్పించేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి

–వెంకటశివారెడ్డి, బూదనంపల్లి

చెరువులలో నీరుంటేనే చేతి నిండా పనులు



చెరువులలో నీరు వుంటే రైతులు ఆయకట్టు రైతులు వరి, వేరుశనగ పంటలను సాగు చేసుకుంటారు. ఈ ఏడాది, గతేడాది వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలు నీరు లేక ఎండిపోయాయి. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో అటు రైతులకు, ఇటు కూలీలకు పనులు లేకుండా పోయాయి.

– రమేష్ , రైతు, ఏలుకుంట్ల

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

అగళి: మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పి ఓ కారు బోల్తా పడింది. స్థానికుల వివరాలమేరకు... హిందూపురంకు చెందిన నవీన్ కుటుంబ సభ్యులు కారులో పెళ్లి నిమిత్తం మంగళూరు బయలుదేరారు. అయితే అగళి జాతీయ రహదారి వద్ద కారు వెనుక చక్రం పంక్చరు అయింది. అతివేగంతో వెళుతున్న కారు అదుపుతప్పడంతో కారు బోల్తా పడింది. కారులోని వారికి మూగ దెబ్బలు తగలడంతో హుటాహుటిన 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులోని ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో ప్రాణాపాయం నుంచి బయట పడినట్లు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండలంలోని పెద్దనపల్లి క్రాస్ 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో అనంతపురానికి చెందిన సుబహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కానిస్టేబుల్ రమేష్ క్షతగాత్రుడిని 108 ద్వారా బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.